జగ్గారెడ్డి ఆధ్వర్యంలో చర్చిలకు క్రిస్మస్ కేకులు

ప్రతీ ఏటా సంగారెడ్డి నియోజకవర్గంలోని చర్చిలకు ప్రత్యేక వాహనాల ద్వారా కేకులు పంపించే సంప్రదాయం



జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి నియోజకవర్గంలోని చర్చిలకు క్రిస్మస్ కేకులను పంపిస్తున్న అర్గనైజర్లు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి సహకారంతో సంగారెడ్డి నియోజకవర్గంలోని చర్చిలకు మంగళవారం కేకులు పంపిణీ చేశారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజి అనంతకిషన్ పర్యవేక్షణలో సుమారు 325 చర్చిలకు ప్రత్యేక డీసీఎం వాహనాల్లో కేకులు చేరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం క్రిస్మస్ సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గంలోని చర్చిలకు జగ్గారెడ్డి కేకులను పంపించడం సంప్రదాయంగా వస్తున్నదని చెప్పారు. క్రైస్తవ కుటుంబాలు సంతోషంగా పండుగ జరుపుకోవాలని జగ్గారెడ్డి ప్రతీ ఏటా కేకులు పంపిస్తారని గుర్తుచేశారు.



కేకులను స్వీకరిస్తున్న సిస్టర్లు

పాటలు పాడి.. కథలు చెప్పి

- గురుకుల విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని బెజ్జంకి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులతో కలిసి మంగళవారం రాత్రి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉత్సాహంగా గడిపారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. "మీకు ఏ కష్టమొచ్చిన మేమున్నామంటూ" భరోసా ఇచ్చారు. లక్ష్య చేధనలో ఎలా ముందుకు వెళ్లాలో కథలు చెబుతూ



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి

వారిలో స్ఫూర్తిని నింపారు. పాటలు పాడి, కథలు చెప్పి విద్యార్థినులను సత్కరించారు. దశాబ్ద కాలం తరువాత ప్రజాప్రభుత్వం డైట్ చార్జీలను పెంచిందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన కామన్ మెనూతో నాణ్యమైన ఆహారం అందిస్తున్నామన్నారు. జీవితంలో గెలవాలంటే ఇప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. రోజు రోజుకు పెరుగుతున్న సాంకేతికత నేపథ్యంలో ప్రతీ రంగంలో ముందుండాలని పిలుపునిచ్చారు.



సమగ్ర శిక్షా ఉద్యోగుల వంటావార్పు

7



హ్యాపీ క్రిస్మస్..

- ముస్తాబైన చర్చిలు

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 24 : క్రిస్మస్ సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని చర్చిలు ముస్తాబయ్యాయి. సిద్దిపేట పట్టణంలోని సీఎస్ఐ (చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) చర్చితో పాటు జిల్లాలోని చర్చిలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. చర్చిల్లో కొన్నిరోజులుగా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని మంగళవారం రాత్రి నుంచే సందడి నెలకొన్నది. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని పలు బేకరీలు, వస్త్రదుకాణాలు కిటకిటలాడాయి.



కల్లు దుకాణాలపై పోలీసుల దాడులు

- 13 గ్రాముల అల్ప్రాజోలం
- 800 లీటర్ల కల్తీ కల్లు స్వాధీనం

7

అంబేడ్కర్ బాటలో ఏబీవీపీ

- అమరుల త్యాగాలు వృథా కానివ్వం
- ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బీ రాజ్



సిద్దిపేటలో ఏబీవీపీ శోభాయాత్ర

మాట్లాడుతున్న శ్రావణ్ బీ రాజ్

సిద్దిపేటక్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయసాధనలో భాగంగా సమాజ విచ్ఛిన్నం కోసం కాకుండా జాతి సమైక్యత కోసం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పనిచేస్తుందని, అంబేడ్కర్ ఆశయాలే ప్రతీ కార్యకర్త మదిలో ఉంచుకుని పనిచేస్తారని జాతీయ కార్యదర్శి శ్రావణ్ బీ రాజ్ అన్నారు. ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర మహాసభల ప్రాంగణం నుంచి కొత్త బస్టాండ్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సావర్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. శోభాయాత్రలో పాల్గొన్న విద్యార్థులపై అడుగడుగునా పూల వర్షం కురిపించారు. కళాకారులు నృత్యాలతో ఉర్రూతలూగించారు. అనంతరం సావర్కర్ చౌరస్తాలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. సభలో జాతీయ కార్యదర్శి శ్రావణ్ మాట్లాడుతూ సావర్కర్ భావజాలంతో వ్యక్తి కంటే దేశం ముందు అనే సిద్ధాంతం కోసం పనిచేస్తున్న అతిపెద్ద విద్యార్థి సంస్థ అఖిల భారత విద్యార్థి పరిషత్ అని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో నక్సలైట్లకు ఎదురొడ్డి తమ ప్రాణాలను అర్పించిన అమరులు ఎందరో ఉన్నారని వారి త్యాగాల స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పనిచేస్తున్నారని, వారి త్యాగాలను వృథా పోనివ్వమని అన్నారు. ఆటంకవాదులు కశ్మీర్ పండితులను ఊచకోత కోసి మూడు రంగుల జెండాను కశ్మీర్ గడ్డపై ఎగరనివ్వబోమని సవాలు చేస్తే, విద్యార్థి పరిషత్ ఆ సవాలను స్వీకరించి ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా శ్రీనగర్లో జాతీయ జెండా ఎగురవేసిన ఘనత విద్యార్థి పరిషత్‌దేనన్నారు. తెలంగాణలో సంక్షేమ హాస్టళ్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడం చేతకానీ రేవంత్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ అవలంభిస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే విద్యార్థి పరిషత్ పోరాటం చేసి కాంగ్రెస్‌ను గద్దె దించుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ ఝాన్సీ, రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పృథ్వి, రాకేష్, శ్రీనివాస్ గౌడ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ చత్రపతి చౌహాన్ పాల్గొన్నారు.

అక్రమ కల్లు దుకాణంపై తిరుగుబాటు

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణంపై గ్రామస్థులు తిరుగుబాటు చేశారు. బానూరు గ్రామంలో రెండు కల్లు దుకాణాలకే అనుమతులు ఉన్నా.. మరో ఐదు దుకాణాల్లో కల్లును అక్రమంగా విక్రయిస్తున్నారని గ్రామస్థులు నాగేష్‌గౌడ్, రాములు, ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో పలువురు మంగళవారం ఆందోళనకు దిగారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కల్లు విక్రయంపై ఎక్సైజ్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలకు కల్లు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బొల్లారంలో తీరనున్న నీటి సమస్య

● త్వరలో మిషన్ భగీరథ నీరు



మిషన్ భగీరథ నీటి ట్రయల్ రన్ పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీ ప్రజలకు కొద్దిరోజుల్లోనే మిషన్ భగీరథ నీటి సరఫరా చేపట్టనున్నట్లు చైర్‌పర్సన్ రోజా రాణి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీలోని కేటీఆర్ కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా ట్రయల్ రన్‌ను ఆమె పరిశీలించారు. మున్సిపాలిటీలో చేపట్టిన భగీరథ పనులు చివరిదశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రతీ నివాసానికి నీటి సరఫరా అందిస్తామన్నారు. అంతకుముందు 17వ వార్డులో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు హన్మంతరెడ్డి, బీరప్ప యాదవ్, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



పోతురాజు, బోనాలతో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన ర్యాలీ

పోతురాజులు, బోనాలతో ర్యాలీ

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ 19 రోజులుగా సమ్మెచేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ఉద్యోగులు బోనం ఎత్తి, పోతురాజుల విన్యాసాలు, డబ్బుచప్పుళ్లతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి సంజీవనగర్‌లోని అమ్మవారి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మరెల్లి దత్తు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. మెదక్ కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంగటి యాదగిరి మద్దతు తెలిపి మాట్లాడారు. అనంతరం డీఆర్వో భుజంగరావు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హీరాలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్, ఇందుమతి, నాయకులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

● తల్లిని చూసి వెళ్తుండగా ఘటన

నర్సాపూర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలప్‌చెడ్ మండలం రాందాస్‌గూడకు చెందిన ఎండ్ల బలరాం(38) దోమడుగులో నివాసముంటూ కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం సొంతూరులో ఉంటున్న తన తల్లిని చూసేందుకు వచ్చి రాత్రి తిరిగి బయలుదేరాడు. నర్సాపూర్ సమీపంలోని అర్బన్‌పార్కు వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అతడిని ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులకు అక్కడికి చేరుకుని బలరాంను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మంగళవారం భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..



బిచ్చమ్మ (ఫైల్)

వెల్దుర్తి, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మామిండ్ల బిచ్చమ్మ (55) ఈ నెల 19న రాత్రి 9గంటలకు గ్యాస్ స్టవ్‌ను వెలిగించి చాలి కాచుకుంటుండగా ప్రమాదవశాత్తు తన చీరకు మంటలు అంటుకుని తీవ్ర గాయాలపాలైంది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యం, అప్పుల బాధలు..

● మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



రెడ్యా(ఫైల్)

నర్సాపూర్,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓ వైపు కూతురు, తాను అనారోగ్యానికి గురవడం, మరోవైపు అప్పులు పెరుగుతుండంతో మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ పంచాయతీ పరిధిలోని అర్జుతండాకు చెందిన హలావత్ రెడ్యా(30)కు భార్య బుజ్జి, తొమ్మిదేళ్ల కూతురు ఉంది. కొంతకాలంగా రెడ్యా ఆరోగ్యం సరిగా లేక వైద్యం కోసం పలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. ఇంతలోనే కూతురు కూడా అనారోగ్యం బారిన పడడంతో పెద్దమొత్తంలో అప్పులు చేసి వైద్యం చేయిస్తున్నాడు. ఎంతకీ ఆరోగ్యం కుదుటపడకపోవడం, మరోవైపు అప్పులు పెరగడంతో మానసిక ఆందోళనకు గురైన అతను సోమవారం రాత్రి నర్సాపూర్‌కు వచ్చి రాయరావు చెరువు వద్ద చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. మంగళవారం తెల్లవారుజామున అటువైపు వెళ్లిన వారు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని కొడుకు..

మాసాయిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన విరాల ప్రకారం బొమ్మరం గ్రామానికి చెందిన పంపే ప్రశాంత్(22) స్నేహితులతో కలిసి జులాయిగా తిరిగేవాడు. దీంతో తండ్రి రామస్వామి అతడిని మందలించి ఏదైనా పని చేసుకోవాలని సూచించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న గ్రామంలోని కల్లు దుకాణం వద్ద ప్రశాంత్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

పంది దాడిలో వృద్ధుడికి గాయాలు



గాయపడిన లాలప్ప

కంగ్టి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పంది దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కంగ్టి మండల కేంద్రానికి చెందిన హాలిగే లాలప్ప(70) మంగళవారం మూత్ర విసర్జన కోసం ఆరు బయటికి వెళ్లగా అటుగా వచ్చిన ఊర పంది ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కళాశాలకు వెళ్లిన యువతి అదృశ్యం

తూప్రాన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన గుడాల మహేశ్ కూతురు గుడాల అఖిల(19) గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. సోమవారం కళాశాలకు వెళ్లిన అఖిల రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాపర్ వైర్ చోరీ



కింద పడేసిన ట్రాన్స్‌ఫార్మర్

జగదేవ్‌పూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌పార్మర్‌లోని ఆయిల్, కాపర్ వైర్ చోరీ చేసిన సంఘటన జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని తిగుళ్ల నర్సింలు వ్యవసాయ పొలం వద్ద 25కేవీ ట్రాన్స్‌పార్మర్ ఉంది. మంగళవారం ఉదయం రైతులు వెళ్లి చూసేసరికి ట్రాన్స్‌పార్మర్ గద్దె నుంచి కింద పడి ఉంది. వెంటనే విద్యుత్ అధికారులకు రైతులు సమాచారం అందించారు. విద్యుత్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా కాపర్ వైర్ ఆయిల్ చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జంతువు దాడిలో మేక పిల్లలు మృతి

చిన్నకోడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన రైతు జక్కుల మల్లయ్య తన వ్యవసాయ బావి వద్ద ఇనుప జాలితో పెన్సింగ్‌ను ఏర్పాటు చేసి మేకల మందను ఉంచుతున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం 12 మేక పిల్లలను జాలిలో ఉంచి మిగతా మేకలను మేత కోసం బయటకు తీసుకెళ్లాడు. సాయంత్రం గుర్తు తెలియని జంతువు జాలిలోని మేక పిల్లలపై దాడి చేసింది. అటుగా వెళ్తున్న గ్రామస్థులు గమనించి జాలి వద్దకు వెళ్లి చూసేసరికి జంతువు పారిపోయింది. ఈ దాడిలో 8 మేక పిల్లలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. 40 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు మల్లయ్య కోరారు. కాగా మేక పిల్లలపై దాడి చేసింది హైనా అయి ఉండొచ్చునని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తొలిసారి ఏడుపాయలకు సీఎం రేవంత్

● పలు అభివృద్ధి పనులకు శ్రీకారం ● ఏర్పాట్లు పూర్తి



ఏడుపాయల ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

పాపన్నపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే రెండవ అతిపెద్దదైన ఏడుపాయలలోని వనదుర్గా భవానీ ఆలయానికి బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రానున్నారు. మొదటగా అమ్మవారి దర్శించుకుని అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని ఆలయం వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి ప్రకాష్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్‌తో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితర ఉన్నతాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. పొతాన్‌శెట్టిపల్లి వైపు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

అభివృద్ధి పనులివే..

రూ.5 కోట్లతో మహిళా ఇంద్రశక్తి భవన్, రూ.29 కోట్లతో చర్చి అభివృద్ధి, రూ. 35 కోట్లతో ఆలయం నుంచి ఏడుపాయల కమాన్ వరకు రోడ్డు విస్తరణ, రూ. 100 కోట్లతో మెదక్ నియోజకవర్గంలో, రూ.52.76 కోట్లతో పలు గిరిజన తండాలలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

వనదుర్గ క్షేత్రం దశ మారనుందా?

ఆధ్యాత్మిక, పర్యాటక, చారిత్రక నేపథ్యం కలిగిన ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రానికి తొలిసారి ముఖ్యమంత్రి వస్తుండడంతో అభివృద్ధిపై ఆశలు పెరుగుతున్నాయి. మంజీరా ఒడ్డున వెలసిన వనదర్గామాత క్షేత్రంలో మహాశివరాత్రికి మూడురోజులు జాతర జరుగుతుంది. లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. అంతేకాకుండా ఏడాది పొడవున వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వేల సంఖ్యలో వస్తుంటారు. ప్రతీ ఆదివారం జాతరను తలపిస్తుంటుంది. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఏడుపాయలకు ఉమ్మడి రాష్ట్రంలో కానీ, తెలంగాణ ఏర్పడిన పదేళ్లలో కానీ ఏ ముఖ్యమంత్రి ఏడుపాయలకు రాలేదు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఏడాదిలోనే అమ్మవారి దర్శనానికి రావడం విశేషం.

కనీస వసతులు కరువు

ఏడాది పొడవుగా భక్తుల రద్దీ ఉండే ఏడుపాయలలో భక్తులకు కనీస వసతులు కరువయ్యాయి. డార్మెటరీ, స్నానగట్టాలు, వసతిగృహాలు, రోడ్ల విస్తరణ, గిరిప్రదక్షిణ, పారిశుధ్య నిర్వహణ ఏర్పాట్లకు నిధులు అవసరముంది. సీఎం ఈ పనులకు నిధులపై ప్రకటన చేయనున్నట్లు తెలుస్తున్నది. పొద్చన్‌పల్లి తండా వరకు రోడ్డు విస్తరణకూ నిధులు కేటాయిస్తారని సమాచారం.

సీఎం పర్యటన ఇలా..

ఉదయం 10.45 బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరి 11 గంటలకు ఏడుపాయల ఆలయ ప్రాంతంలో పోతన్‌శెట్టిపల్లి వైపు నిర్మించిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 11.05 గంటలకు అమ్మవారి ఆలయానికి చేరుకుని 11.10 గంటలకు గర్భగుడిలో దుర్గామాతకు పూజలు చేస్తారు. 11.30 నుంచి 11.40 గంటల వరకు ఆలయ, నియోజకవర్గ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి 11.45 గంటలకు మెదక్ చర్చికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 12 నుంచి 12.40 గంటల వరకు చర్చి ప్రాంగణంతో పాటు జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఒంటి గంటకు హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

ఘనపురం ఆనకట్టకు నిధులు వచ్చేనా?

జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్ట్ ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపు పనులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు కింద సుమారు 25వేల ఎకరాల ఆయకట్టు ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ ఆనకట్ట ఎత్తును పెంచుతున్నట్లు ప్రకటించి, రూ.43.4 కోట్లు మంజూరు చేశారు. పనులు ప్రారంభమైనా భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వక పనులు ముందుకు సాగడంలేదు. దీనిపైనా సీఎం సానుకూల ప్రకటన ఏమైనా చేస్తారని ఎదురుచూస్తున్నారు.

కొత్త బ్రిడ్జి ప్రారంభానికి ఎదురుచూపులు

ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల మధ్య రవాణ భారాన్ని తగ్గించేందుకు ఎంకంపల్లి-రాంతీర్థం వద్ద మంజీరా నదిపై రూ.18 కోట్లతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు మూడేళ్లక్రితం పూర్తిచేశారు. పాపన్నపేట మండలం రాంతీర్థంవైపు అప్రోచ్ రోడ్ నిర్మాణం జరుగకపోవడంతో వంతెన నిరుపయోగంగా మారింది. పాపన్నపేట మండలంలో ఐదు కిలోమీటర్ల అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి సీఎం సానుకూలంగా స్పందిస్తే బ్రిడ్జి ఉపయోగంలోకి వస్తుందని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

ఐఐటీహెచ్‌లో 'విశ్వకర్మ అవార్డ్స్'

● ముగ్గురు విజేతలకు రూ.లక్ష చొప్పున అందజేత



చెక్కును అందజేస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తదితరులు

కంది, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) మేకర్ భవన్ ఫౌండేషన్, ఐఐటీ హైదరాబాద్ స్టార్టప్ సంస్థ ఐటీఐసీ ఇంక్యుబేటర్‌లు సంయుక్తంగా 'విశ్వకర్మ అవార్డ్స్-2024' పేరిట ఐఐటీ హైదరాబాద్‌లో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. చాలెంజ్, కోలాబ్రెట్, క్రియేట్ థీమ్‌తో విద్యార్థి ఆవిష్కర్తలకు నీరు-పారిశుధ్యం, గ్రీన్-టెక్నాలజీ, స్మార్ట్-మొబిలిటీలపై ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ఈ నెల 21, 22 తేదీల్లో పోటీలు జరిగాయి. దేశవ్యాప్తంగా 278 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 526 దరఖాస్తులు అందాయి. వాటిల్లో 18 కళాశాలలకు చెందిన బృందాల ఆవిష్కరణలను ఎంపిక చేశారు. 18 ఆవిష్కరణల్లో గ్రీన్ టెక్నాలజీలో ఐఐటీ ఢిల్లీకి చెందిన విద్యార్థిని కుసుమ్ సైనికి, నీరు-పారిశుధ్యంపై ఐఐటీ గౌహతి విద్యార్థులు హరీష్ కుమార్, మహ్మద్ అస్కర్ దీన్, సులైహ జువారియాలకు, స్మార్ట్ మెబిలిటిలో పశ్చిమబెంగాల్ అడమాస్ విశ్వవిద్యాలయం విద్యార్థులు సుమంత్‌రాయ్, సౌమ్యదీప్‌దాస్ బృందాలకు ప్రథమ బహుమతులు దక్కాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బైన్ క్యాపిటల్స్ ఇండియా ఆఫీస్ ఛైర్‌పర్సన్ అమిత్ చంద్ర, హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు అజయ్ చౌదరి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మంగళవారం యువ ఆవిష్కర్తలకు ఒక్కో బృందానికి రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఐఐటీహెచ్‌లో ప్రపంచస్థాయి సవాళ్లను పరిష్కరించేందుకు సాధికారత కలిగిన ఆవిష్కర్తలను ప్రోత్సహించడానికి తాము కట్టుబడి ఉన్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జాబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని, యువకులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు 1 జనవరి 2005 నుంచి 1జూలై 2008 మధ్య జన్మించిన అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభర్థులు 7 జనవరి 2025 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 22 మార్చి 2025 నుంచి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ఉంటుందని, పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

రావి ఆకుపై ఏసుక్రీస్తు చిత్రం



మనోహరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బ్రహ్మచారి రావి ఆకుపై ఏసుక్రీస్తు చిత్రాన్ని గీశారు. బుధవారం క్రిస్‌మస్ పండుగ సందర్భంగా ఈ చిత్రాన్ని గీసి శుభాకాంక్షలు తెలిపారు.

కల్లు దుకాణాలపై పోలీసుల దాడులు

● 13 గ్రాముల ఆల్ప్రాజోలం, 800 లీటర్ల కల్తీ కల్లు స్వాధీనం

● నలుగురి అరెస్టు, పరారీలో ఐదుగురు



పోలీసులు స్వాధీనం చేసుకున్న అల్పజోలం

సిద్దిపేట క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, పరిసర ప్రాంతాల్లోని కల్లు డిపోలలో కొందరు ఆల్ప్రాజోలం కలిపి కల్తీకల్లును విక్రయిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు మంగళవారం ఏకకాలంలో దాడులు చేపట్టారు. భారత్‌నగర్‌లో ఉన్న కల్లుడిపో, ఇందిరమ్మ కాలనీలో ఉన్న కల్లు దుకాణం, పటేల్‌పురంలో ఉన్న కల్లు షాపు నంబర్-2, రంగధాంపల్లి కల్లు దుకాణంలో తనిఖీ చేశారు. ఈ క్రమంలో 13 గ్రాముల ఆల్ప్రాజోలం, 800 లీటర్ల కల్తీకల్లు (1118సీసాలు) స్వాధీనం చేసుకున్నారు. పల్లెరాములు, అంబటి రాజు, పల్లె అంజయ్య గౌడ్, బోడిగే శ్రీనివాస్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాదగోని ప్రకాష్ గౌడ్, గాదగోని శ్రీనివాస్ గౌడ్, పల్లె అనిల్, ముండ్రాయి రాజు, గడ్డమీది రాజా గౌడ్ పరారీలో ఉన్నారు. జిల్లాలో ఎక్కడైనా కల్తీ కల్లు విక్రయించినట్లు తెలిస్తే వారి వివరాలను 8712671111 లేదా యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908 కాల్ చేసి తెలియజేయాలని సూచించారు. సమాచార అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీలు ఉపేందర్, పుష్పం కుమార్, సోమనాథం, సిద్దిపేట ఏసీపీ మధు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ రావు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

31లోపు బస్టాండ్ పనులు పూర్తిచేయాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్



బస్టాండ్ పనులపై మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31లోపు హుస్నాబాద్ బస్టాండ్ ఆధునీకరణ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన హుస్నాబాద్ బస్టాండ్ పనులను పరిశీలించారు. పనుల ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండ్ సుందరీకరణ, లోపలికి, బయటకు వచ్చే మార్గాలను అభివృద్ధి చేయాలని, ఆర్టీసీ కాంప్లెక్స్‌లకు రంగుల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు వైండింగ్‌లో షాపులు కోల్పోతున్న వారితో మాట్లాడారు. వారికి నష్టం జరుగకుండా పనులు చేస్తామన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, నాయకులు ఎగ్గిడి అయిలయ్య, బంక చందు, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం

హుస్నాబాద్ మున్సిపాలిటీకి చేంజ్ మేకర్ అవార్డు రావడంపై మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ పాలకవర్గాన్ని సన్మానించారు. ఇందుకు సహకరించిన పట్టణ ప్రజలు, పారిశుధ్య కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు కొంకటి నళిని దేవి, చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, పెరుక భాగ్యరెడ్డి, అయూబ్, ఎన్విరాల్ మెంట్ ఇంజనీర్ రవికుమార్ తదితరులున్నారు.

మెదక్ చర్చి ముస్తాబు

నేడే క్రిస్మస్

సీఎస్ఐ వందేళ్ల సంబరాలు

హాజరవుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రాంగణంలో ఘనంగా ఏర్పాట్లు





ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ క్యాథడ్రల్ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. చర్చి నిర్మాణం పూర్తయి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈసారి ఉత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తుండడంతో చర్చి కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేశారు. ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద చర్చి అయిన మెదక్ సీఎస్ఐ ప్రాంగణంలో జరిగే క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. విదేశీయులు సైతం వేడుకల్లో పాల్గొనడానికి వస్తుంటారు. ఈ అద్భుత కట్టడాన్ని చూసి మైమరిచిపోతారు. సీఎం రాక సందర్భంగా జిల్లా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

- మెదక్ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

వర్గల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌కు చెందిన జమలాపురం మహారాణి వారి కుటుంబ సభ్యులు హరిదాసు, మల్లికార్జున్, శివసాయి ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు లక్ష పుష్పార్చన చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.

ఉత్సాహంగా సీఎం కప్ ఉమ్మడి జిల్లా ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో సీఎం కప్ ఉమ్మడి జిల్లా ఎంపికలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ఖాసీంబేగ్ క్రీడలను ప్రారంభించారు. తదితర క్రీడల్లో తలపడేందుకు ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో ఖాసీంబేగ్ మాట్లాడుతూ క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి పంపడమే లక్ష్యంగా సీఎం కప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అటవీ అధికారుల సమాఖ్య దక్షణాది రాష్ట్రాల అధ్యక్షుడిగా పవన్‌కుమార్

గజ్వేల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ అటవీ సెక్షన్ అధికారి పవన్‌కుమార్ దక్షిణాది రాష్ట్రాల అటవీ అధికారుల సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో జాతీయ అటవీ అధికారుల సంఘం ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా తెలంగాణకు చెందిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మోజం అలీఖాన్, ఆలిండియా జనరల్ సెక్రటరీగా మెదక్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఆజం హుస్సేన్ ఎన్నికయ్యారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల వంటావార్పు

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన కొనసాగుతున్నది. వీరికి మద్దతుగా మంగళవారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలన్నారు. అన్నిరకాల సెలవులు ఇవ్వడంతోపాటు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమ్మెపై స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజ్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నవీన్, రాష్ట్ర నాయకులు సురేందర్, కృష్ణవేణి ,ఉపాధ్యక్షులు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా అమిత్‌షా వ్యవహరించడాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్ నేతృత్వంలో మంగళవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలో కాగడాల ప్రదర్శన చేపట్టారు. ముందుగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ నుంచి సుభాష్ గంజ్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వరకు కాగడాలతో ప్రదర్శన చేసి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు ఆధ్వర్యంలో మంగళవారం జహీరాబాద్‌లో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజామియా, జనార్ధన్, గోపాల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కేవీకేకు ఉప రాష్ట్రపతి రాక

సేంద్రియ సాగు చేసే రైతులతో సమావేశం

కౌడిపల్లి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 24: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మలు బుధవారం మెదక్ జిల్లాకు రానున్నారు. జిల్లాలోని కౌడిపల్లి మండలం తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో సుమారు 800 మంది రైతులు పాల్గొంటున్నారని, వారికి ఇప్పటికే పాస్‌లు అందజేశామని కేవీకే అధికారులు తెలిపారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి కేవీకేను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలిప్యాడ్‌లో బాంబ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేశారు. ఆయన వెంట మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

పొగాకును వినియోగించొద్దు

● సంగారెడ్డి జిల్లా పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్



పొగాకు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పొగాకు వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, అందువల్ల పొగాకు ఉత్పత్తులను వినియోగించరాదని జిల్లా పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పొగాకు వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వినియోగించారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, చుట్టా, సిగరేట్, తంబాకు, పాన్ మసాల లాంటివి వినియోగించొద్దని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగితే రూ.200 జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రీజనల్ రింగ్‌రోడ్డుకు భూములు ఇవ్వం

గజ్వేల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): "చావనైనా చస్తాం.. కానీ రీజనల్ రింగ్‌రోడ్డుకు భూములు మాత్రం ఇవ్వబోమని వర్గల్ మండలం సామలపల్లి, రాయపోల్ మండలం బేగంపేట, ఎల్కల్ గ్రామాల రైతులు అల్టిమేటం జారీ చేశారు. గజ్వేల్‌లోని సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవన సముదాయంలోని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి మాట్లాడారు. ఎన్నికల సమయంలో రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుతున్నామని హామీ ఇచ్చి ఇప్పుడు బలవంతంగా రాత్రివేళల్లో సర్వేలు చేపట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. తమకున్న భూమిని ప్రభుత్వం లాక్కుంటే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. భూమికి భూమి ఇవ్వాలని, లేదా ఎకరాకు రూ.3 కోట్ల పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. తాము ఆర్డీవో కార్యాలయంలో మెమోరాండం ఇచ్చేందుకు వస్తే పోలీసులు, బెటాలియన్ సహాయంతో అధికారులు తమ భూముల వద్దకు చేరుకుని సర్వే చేపట్టేందుకు యత్నిస్తున్నారని, ఇది ఏమాత్రం సరికాదన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు.



ఆందోళన నిర్వహిస్తున్న రీజనల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసిత రైతులు

భక్తులపై పట్టింపేదీ?

- మల్లన్న ఆలయానికి లక్షల్లో భక్తులు
- ఖాళీ స్థలాల్లో గుడారాలు వేసుకొని తలదాచుకుంటున్న వైనం
- నాలుగు బ్లాక్‌లలో ఉన్నవి 50 మరుగుదొడ్లే
- నిర్వహణ లేక నేలమట్టమైన తాత్కాలిక టాయిలెట్లు
- బహిర్భూమికి వెళ్లాలంటే చెట్లు, గుట్టలే దిక్కు
- దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు



గదుల విచారణ కార్యాలయ సమీపంలోని టాయిలెట్లు




మల్లన్న జాతర సమయంలో భక్తుల రద్దీ(ఫైల్), ఖాళీ స్థలంలో భక్తుల వేసుకున్న గుడారాలు, బస్టాండ్ సమీపంలో ధ్వంసమైన తాత్కాలిక మరుగుదొడ్లు

చేర్యాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లన్న జాతరను పురస్కరించుకుని ఏటా లక్షలాదిగా తరలివచ్చే భక్తుల పట్ల ఆలయ వర్గాలు, ప్రజాప్రతినిధులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయ ఆదాయం నానాటికి పెరుగుతున్నప్పటికీ కనీస వసతుల కల్పనకు చొరవ చూపడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వసతి, మరుగుదొడ్లు లేక ఇక్కట్లు

ఏటా మూడునెలలపాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతుండటంతో పొరుగు రాష్ట్రాల నుంచి లక్షల్లో భక్తులు తరలివస్తుంటారు. నాలుగు బ్లాకులలో కేవలం 50 టాయిలెట్లు మాత్రమే ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో మల, మూత్ర విసర్జనకు చెట్లు, గుట్టల చాటుకు పరిగెత్తాల్సి వస్తున్నది. సరైన వసతులు లేక పోవడంతో భక్తులు ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపించినా, అక్కడే పరదాలతో గుడారాలు వేసుకుని బస చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లను విస్తరించకపోవడంతో సమీప ప్రదేశాల్లోనే మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ముక్కుమూసుకుని మొక్కులు చెల్లించుకునే దుస్థితి నెలకొన్నదని భక్తులు వాపోతున్నారు. అవసరమైన ఏర్పాట్లు లేక ఓవైపు భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లుతుండగా మరోవైపు మరుగుదొడ్లు లేక ఆత్మగౌరవం దెబ్బతింటున్నదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రూ.కోట్లు వెచ్చించినా...

కల్యాణంతో పాటు ఇతరత్రా ముఖ్యఘట్టాల సమయంలో మొబైల్ టాయిలెట్లు తెప్పిస్తున్నా ఒకటి, రెండురోజులకే పరిమితమవుతున్నాయి. ఇందుకోసం వేలాది రూపాయలు వెచ్చించినా భక్తులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడంలేదు. దాసారంగుట్ట అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.కోట్లు వెచ్చించినా అతీగతీ లేక పోగా, సాధారణ భక్తులకు అత్యవసరాలైన టాయిలెట్లపై కూడా బాధ్యులు దృష్టి సారించడం లేదు. గతంలో ఆర్టీసీ బస్టాండు సమీపంలో రూ. లక్షలు వెచ్చించి తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించినా నిర్వహణ, పర్యవేక్షణ లేక ధ్వంసమయ్యాయి. బండగుట్టపై 50గదుల సత్రం భవన నిర్మాణం చేపట్టడంతో సీసీ రోడ్డు నిర్మాణంకోసం వాటిని తొలగించారు. నాటి నుంచి నూతన టాయిలెట్ల బ్లాకుల ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడంతో భక్తులకు బహిర్భూమి కష్టాలు తప్పడం లేదు. ఈ నెల 29న స్వామివారి కల్యాణం జరగనున్నప్పటికీ జనవరి 19నుంచి .కొనసాగనున్న జాతరకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన టాయిలెట్ బ్లాకులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

టాయిలెట్ బ్లాకులను నిర్మించాలి



ఆలయం నలుదిక్కులా భక్తులు ఆరుబయట బస చేస్తున్నారు. భక్తుల సంఖ్యకు సరిపడా టాయిలెట్ బ్లాకులను నిర్మించాలి. బహిరంగ మల, మూత్ర విసర్జనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.ఆలయాధికారులు శాశ్వత ప్రాతిపదికన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి పట్నంవారం జాతరకు అందుబాటులోకి తీసుకురావాలి.

- ఏర్పుల మహేశ్, కొమురవెల్లి

ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి


ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 75 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ముంపు గ్రామమైన వేములఘాట్ ఆర్అండ్ఆర్ కాలనీకి సీసీ రోడ్లు, డ్రైనేజీలను తక్షణమే నిర్మించాలని కాలనీ వాసులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాలలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం నుంచి, అలాగే మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కుకునూరుపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసుల ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని తిప్పారం గ్రామశివారులో పేకాడుతున్నట్టు విశ్వసనీయ సమాచారమందడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ స్థానిక పోలీసులతో కలిసి దాడి చేశారు. నిందితుల నుంచి రూ.8,430 నగదుతో పాటు 6 మొబైల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 24 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్లలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 24 మంది మద్యం తాగి వాహనాలు నడిపిస్తూ పట్టుబడ్డారని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వారిని మంగళవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం రూ.46,500 జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ వెల్లడించారు.

జాతీయస్థాయి రగ్బీకి ఎంపికైన విద్యార్థినికి అభినందన


మహ్మదాపూర్‌లో అంజలిని అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ చెందిన పదో తరగతి విద్యార్థిని గొల్లపల్లి అంజలి జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక కావడం పట్ల మంగళవారం సాయంత్రం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాలువా కప్పి అభినందించారు. ఈ నెల 28 నుంచి 30 వరకు బిహార్ రాష్ట్రంలోని పాతేనాలో జాతీయస్థాయి రగ్బీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు వెళ్లేందుకు అంజలికి ఆర్థికసాయాన్ని అందజేశారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్‌కు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో సత్తయ్య

కుకునూరుపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీఎం కప్ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎన్నికయ్యారు. సోమవారం సిద్దిపేట ఇండోర్ స్టేడియంలో ముగిసిన టేబుల్ టెన్నిస్ అండర్ 19 జూనియర్ బాలుర విభాగంలో 8వ తరగతి చదువుతున్న జీశాన్ అలీ అలాగే బాలికల విభాగంలో భానుప్రియ వెండి పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. అలాగే హర్షిత్, వర్షిత కాంస్య పతకాలు సాధించి మూడో స్థానంలో నిలిచారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను ఎంఈవో బచ్చలి సత్తయ్య అభినందించారు.

తడి, పొడిచెత్త నిర్వహణను పరిశీలించిన కమిషనర్


పొడిచెత్త, తడిచెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

దుబ్బాక, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపాలిటీలో స్వచ్ఛతకే ప్రాధాన్యతనిస్తూ, పారిశుధ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నామని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ డీఆర్సీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ- తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రీయ ఎరువును తయారు చేస్తున్నట్టు తెలిపారు. వాహనంలోనే చెత్తను వేర్వేరుగా చేసి వేయాలని కోరారు.

టీఎస్ యూటీఎఫ్ మహాసభల పోస్టర్ విడుదల

చేర్యాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలో ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్లను మంగళవారం చేర్యాలలో ఎంఈవో రచ్చ కిష్టయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి మాట్లాడుతూ మహాసభలలో ప్రభుత్వ విద్యారంగంపై మేధావుల ఆధ్వర్యంలో చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్, ప్రతినిధులు పిల్లి రాజు, కాటం శ్రీనివాస్, బూరుగు సత్యనారాయణ, పాక చంద్రమౌళి, కాటం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'స్కూల్ వద్ద నుంచి కోళ్లఫారంను తొలగించాలి'

దుబ్బాక, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం పద్మశాలీ గడ్డ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో అనుమతి లేకుండా కోళ్లఫారం నిర్మించారంటూ మంగళవారం దుబ్బాక పోలీసులకు గ్రామ ప్రత్యేక అధికారి రోహిత్ శ్రీవాత్సవ ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కొంతమంది వ్యక్తులు గ్రామ సభ నుంచి గానీ, ఇతర ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ పాఠశాల ఎదురుగా వీటిని నిర్మించారని తెలిపారు. అంతేకాకుండా సమీపంలో నీటికుంట ఉండటంతో ఆ నీరు కాలుష్యకారకంగా మారుతున్నాయన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా దీనిని తొలగించాలని నోటీసులు ఇచ్చినా సంబంధిత వ్యక్తులు స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు గ్రామ ప్రత్యేకాధికారి తెలిపారు.

మృతుడి కుటుంబానికి 'పల్లా' ఆర్థికసహాయం

చేర్యాల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం రసూలాబాద్ గ్రామానికి చెందిన బండిసుజాత(48) అనారోగ్యంతో మృతి చెందగా, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఫోన్‌లో మృతురాలి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే తరఫున రూ.5వేలు ఆర్థికసహాయాన్ని స్థానిక నాయకులు కుటుంబసభ్యులకు అప్పగించారు. అలాగే బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి రూ.5వేలు విరాళంగా అందజేశారు.

కార్మికుల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి

గజ్వేల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్మికరంగ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని ఆ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన జంగ యాదగిరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.50వేల ఇన్సూరెన్సు చెక్కును ఆయన అందజేశారు. ఆయన వెంట గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, బీఆర్టీయూ టాక్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అత్తినమౌని నాగేష్, జిల్లా ప్రెసిడెంట్ కనకయ్య కార్మికులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కుకునూరుపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకుడు దేవి రవీందర్ మంగళవారం అందజేశారు. తప్పపల్లి గ్రామానికి చెందిన కంకణాల రామస్వామికి రూ. 24వేలు, లకుడారం గ్రామానికి చెందిన అనంతం నగేష్ రూ. 12వేలు, తిప్పారం గ్రామానికి చెందిన మల్లవ్వకు రూ. 12వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

ప్రజాపాలనపై దృష్టి సారించాలి

గజ్వేల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ఎన్‌సీ సంతోష్ సూచించారు. గజ్వేల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వరుసగా సినీనటులను టార్గెట్‌గా చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీసిందన్నారు. గురుకులాల్లో వందలాదిమంది విద్యార్థులు అస్వస్థతకు గురైతే ప్రభుత్వానికి పట్టింపు లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదించి ప్రజాపాలనపై దృష్టి పెట్టాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా హరీశ్


నియామకపత్రాన్ని అందుకుంటున్న హరీశ్

సిద్దిపేట రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్‌గా నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామానికి చెందిన ఎర్ర హరీశ్‌ను జిల్లా కన్వీనర్‌గా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కొమ్మ విజయ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎర్ర హరీశ్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో బాధ్యతలు ఇచ్చినందుకు జిల్లా అధ్యక్షుడు విజయ్, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ కార్యదర్శి నాయిని నర్సింహరెడ్డి, సేవాదళ్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సాకి అనంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్లక్ష్యమే కార్మికుడిని బలిగొంది!

- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసు, విద్యుత్ అధికారులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, హెచ్‌టీ వైర్ల కింద మట్టి కుప్పపై ఏర్పాటు చేసిన కర్రస్తంభం

రాయపోల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఘటనా స్థలంలో నిర్లక్ష్యం వల్లే ఈ నెల 23న ముంగీస్‌పల్లి వద్ద వలసకార్మికుడు విద్యుదాఘాతానికి గురై మరణించాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. రాయపోల్ మండలం ముంగీస్‌పల్లి, ఆరేపల్లి గ్రామాల మధ్య కొండపోచమ్మసాగర్ డిస్ట్రిబ్యూషన్ కాలువ పనులు జరుగుతున్నాయి. కాలువ కోసం తీసిన మట్టిని కాలువ వెంబడి రెండు వైపులా పోస్తున్నారు. అయితే రోడ్డు వెంబడి హెచ్‌టీ లైన్ ఉన్నప్పటికీ ఆ వైర్ల కింద కూడా మట్టి పోశారు. ఈ క్రమంలో సోమవారం వచ్చిన కాంక్రీట్ మిక్సింగ్‌ను కాలువలో పోయడానికి వాహనాన్ని కాలువ దగ్గరకు రివర్స్‌లో తీసుకెళ్తున్న క్రమంలో పైన ఉన్న వైర్లకు తాకింది. అదే సమయంలో కాంక్రీట్ మిక్సింగ్‌ను కాలువలో పోస్తున్న అంజిబాబు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వాహనం పైన వైర్లను తాకుతుందనే విషయాన్ని నిర్వాహకులతో పాటు ఎవరూ గమనించకపోవడం వల్ల ఓ కార్మికుడి నిండు ప్రాణం బలైంది.

పొంచిఉన్న ప్రమాదం

ప్రమాదం చోటు చేసుకున్న ప్రాంతంలోనే కాలువకు మరో వైపు విద్యుత్ వైర్ల కింద పెద్ద మట్టి కుప్పను పోశారు. అక్కడ విద్యుత్ వైర్లు చేతులకు అందే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఓ కర్ర స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను పైకి లేపారు. కర్రస్తంభం పడిపోతే మరో ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. మంగళవారం పోలీస్, విద్యుత్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ వైర్ల కింద వాహనంతో మట్టిని పోస్తున్నామని తమకు చెబితే విద్యుత్ సరఫరాను నిలిపివేసేవారిమని ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం యజమానుల దగ్గరనే ఉందని, దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

కొండపాకలో తెరుచుకోని ఎమ్మార్సీ


ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

కొండపాక, డిసెంబరు 24 : సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో ఎమ్మార్సీ కార్యాలయం గత 15 రోజులుగా మూతపడింది. ఉద్యోగులంతా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మెబాట పట్టారు. దాంతో ఎమ్మార్సీలలో పని చేసే ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీఆర్పీలు, ఆపరేటర్స్ ఎవరు కూడా విధులకు వెళ్లకుండా సమ్మెలో ఉండడంతో కార్యాలయం తెరుచుకోలేదు. దీంతో ఎమ్మార్సీలో జరిగే అన్ని రకాల పనులు స్తంభించిపోయాయి. విద్యాశాఖ సమగ్ర శిక్షలోని ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎంఐఎస్ కోఆర్డినేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం సురేందర్ డిమాండ్ చేశారు. ఎమ్మార్సీలలో కొత్త పోస్టులను క్రియేట్ చేసి అందులో నియమించాలని అంతవరకు హెచ్ఆర్ పాలసీతో కూడిన పే స్కేల్ అందించాలన్నారు. హెల్త్‌కార్డులు ఇవ్వాలని, రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ ప్రయోజనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భద్రతపై భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్


సిద్దిపేటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసు అధికారులు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ స్థానిక పోలీసు అధికారులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని మెదక్ రోడ్, గాంధీ రోడ్, సుభాష్‌రోడ్, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, ముస్తాబాద్ చౌరస్తా, భారత్ నగర్ ,శివాజీ నగర్, ఓల్డ్ బస్టాండ్ తదిర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మధు మాట్లాడుతూ.. జిల్లాలో ఏదైనా శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ జిల్లా పోలీసులకు సహకారం అందిస్తుందని, ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, 2టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ డిప్యూటీ కమాండెడ్ టీపీ బగేల్, ఇన్‌స్పెక్టర్లు హరిబాబు, మల్లేశ్వరరావు, ఆర్ఏఎఫ్ సిబ్బంది, వన్ టౌన్ ఎస్ఐ కనకయ్య, 80మంది పోలీస్ సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయానికి తాళం తీయరూ..!

- అందుబాటులో ఉండని అధికారులు.. వినియోగదారులకు ఇక్కట్లు


తొగుటలో విద్యుత్ కార్యాలయానికి తాళం వేసి ఉన్న దృశ్యం

తొగుట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించే ఉద్దేశంతో మండల కేంద్రమైన తొగుటలో రూ.లక్షలు వెచ్చించి విద్యుత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు అక్కడే ఉండి విధులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులు విద్యుత్ కార్యాలయానికి వేసిన తాళం తీయకపోవడంతో కార్యాలయ ఆవరణ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చినప్పటికీ తాళం వేసి ఉండటంతో వెనుదిరిగివెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


బతుకమ్మ పార్కింగ్ ప్రహరీ నుంచి నరికివేసిన చెట్లు

కొమురవెల్లిలో చెట్ల నరికివేత

చేర్యాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులకు నీడ కల్పించేందుకు ఆలయ సమీపం నుంచి చెరువు వరకు రోడ్డు పక్కన గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. అయితే విద్యుత్ తీగల కింద ఉండటంతో తరచూ విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయనే కారణంతో మంగళవారం కొన్ని చెట్లను నరికివేశారు. అయితే అడ్డుగా ఉన్న కొమ్మలను కాకుండా ఏకంగా చెట్లను నరికివేశారు. భక్తులకు నీడ లేకుండా చేశారని గమనించిన స్థానికులు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు రహదారికి పచ్చదనంతో శోభను సంతరింపజేస్తూ భక్తులకు నీడను కల్పిస్తుండగా విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో రోడ్డు కళావిహీనంగా మారిందని స్థానికులు, భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన వైస్ చాన్స్‌లర్


పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైస్ చాన్స్‌లర్ ఉమేశ్ కుమార్

హుస్నాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని మంగళవారం శాతావాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులను తనిఖీ చేశారు. కళాశాలలో ఉన్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి విద్యార్థుల అభ్యున్నతి కోసం చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వైస్ చాన్స్‌లర్‌కు వివరించారు.

పేదల అభివృద్ధి కోసం పెరియార్ కృషి


పెరియార్ రామస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేదల జీవితాల అభివృద్ధి కోసం మనుధర్మంపై పెరియార్ రామస్వామి యుద్ధం ప్రకటించారని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పెరియార్ రామస్వామి 51వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరియార్ రామస్వామి గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జాలిగామ బాల్‌నరసయ్య, స్వామి, మంజీరా దళిత సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కిరణ్, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు ఉన్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు


ఆయిల్ పామ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిద్దిపేట రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి నరేష్ రైతులకు సూచించారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేస్తే ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు కోసం రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి కౌసల్య, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్, ఆయిల్ ఫెడ్ అధికారి హరీశ్, రైతులు పాల్గొన్నారు.